సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 9 । అక్టోబర్ । 2024



రూ.2 లక్షల విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి వేంద్ర రమేష్ కుమార్ (భీమవరం) రూ.2,02,232 విరాళం అందించారు.



రూ.30 లక్షలతో అలంకరణ

గోకవరం: దేవీచౌక్ ఆలయంలో కనకదుర్గమ్మను మంగళవారం రూ.30 లక్షల కరెన్సీతో మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. అష్టోత్తర ప్రసాద (108 రకాలు) మహానివేదన చేశారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 98,416 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 14,200 క్యూసెక్కుల నీటిని వదిలారు.

అన్నీ మావే.. అంతా మేమే..

- మద్యం దుకాణాలపై కూటమి నేతల కన్ను
- దరఖాస్తుదారులకు బెదిరింపులు
- దుకాణం దక్కినా తమకే ఇవ్వాలని ఆదేశాలు
- లేకుంటే వ్యాపారం సాగనివ్వబోమని హెచ్చరికలు
- నేటితో ముగియనున్న గడువు



సాక్షి, రాజమహేంద్రవరం: మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు కూటమి నేతలు అడ్డగోలు వ్యవహారానికి తెర తీస్తున్నారు. అనుకున్నదే తడవుగా రంగంలోకి దిగుతున్నారు. కుదిరితే షాపులు కైవసం చేసుకోవడం, లేదంటే తమ అనుచరులకు వరించేలా పావులు కదుపుతున్నారు. రెండూ సాధ్యం కాని పరిస్థితుల్లో ఆశావహులను బెదిరింపులకు గురి చేసేందుకు సైతం వెనుకాడటం లేదు. తమను కాదని టెండర్లు వేసిన వ్యాపారులను తమ దారికి తెచ్చుకునేందుకు అన్ని అస్త్రాలను వాడుతున్నారు. ఎవరు దరఖాస్తు చేసినా సిండికేట్‌కు కట్టుబడి ఉండేలా ఆదేశాలు జారీ చేస్తున్నారు. ముఖ్యంగా టీడీపీ నేతల నుంచి ఈ బెదిరింపులు ఎక్కువగా వస్తుండటంతో ఎందుకొచ్చిన తలనొప్పిలే అని వ్యాపారులు టెండర్లు వేసేందుకు సాహసించడం లేదన్న ఆరోపణలున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 125 షాపులు

జిల్లా వ్యాప్తంగా 125 షాపులకు గాను 4 వేలకు పైగా దరఖాస్తులు అందుతాయని భావించారు. కానీ మంగళవారానికి కేవలం 2,138 మాత్రమే వచ్చాయి. నేటితో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుంది. ఔత్సాహిక వ్యాపారులపై బెదిరింపులు తీవ్రమవ్వడంతో దరఖాస్తులు నత్తనడకన సాగుతున్నాయి. మద్యం దుకాణాలపై టీడీపీ, కూటమి నేతలు దృష్టి పెట్టారు. ఇసుక తర్వాత ప్రధాన ఆదాయ వనరు మద్యం కావడంతో టీడీపీ నేతలు దుకాణాలు దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. టీడీపీ నేతల అండ లేకుండా వ్యాపారం చేయడం కష్టమని భావిస్తున్న వ్యాపారులు.. టెండర్లలో పాల్గొనేందుకు తర్జనభర్జన పడుతున్నారు. ఇక వైఎస్సార్ సీపీ మద్దతు దారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. అధికార పార్టీలో సైతం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, కీలక నేతల అండలేనివారు దుకాణాలకు దూరంగా ఉంటున్నారు.

ఆదాయమే పరమావధి

ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాలు కట్టబెట్టడంతో దరఖాస్తు రుసుం, ఏరియా ప్రకారం లైసెన్సు ఫీజు రూపంలోనే సగటున ఒక్కో షాపునకు రూ.కోటి వరకు ఆదాయం వస్తుందని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 125 షాపులకు సగటున రూ.60 లక్షలు చొప్పున లెక్కగట్టినా సుమారు రూ.75 కోట్లకు పైగా ప్రభుత్వానికి ఆదాయం రానుంది. తాజా మద్యం విధానంతో వ్యాపారుల కమీషన్ 20 శాతానికి పెంచారు. లైసెన్సు పొందిన దుకాణాన్ని ఆ పట్టణం, మండలంలో ఎక్కడైనా వ్యాపారి ఇష్టం మేరకు ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పించారు. దీంతో మరింతగా లాభాలు వస్తాయని భావించిన వ్యాపారులు దరఖాస్తులకు మొగ్గు చూపారు. కూటమి నేతల బెదిరింపులతో ఎక్కడొచ్చిన యాతనలే అనుకుని మిన్నకుండిపోతున్నారు.

రంగంలోకి ఎమ్మెల్యేలు, కీలక నేతలు

మద్యం షాపులు కైవసం చేసుకునే తరుణంలో అధికార పార్టీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు తమ అనుచరులను రంగంలోకి దింపుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ప్రస్తుతం అధికార పార్టీ కీలక ప్రజా ప్రతినిధులకు గతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్యం వ్యాపారంతో సంబంధాలు, మద్యం వ్యాపారం చేసిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం మళ్లీ పాత నేతలే రంగంలోకి దిగుతున్నారు. మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేస్తారన్న అనుమానం ఉన్న వారికి ప్రధాన పార్టీ నేతల నుంచి పరోక్షంగా హెచ్చరికలు వెలుతున్నాయి. మా ప్రాంతంలో మేమే లేదా మావాళ్లు వ్యాపారం చేసుకుంటారు. మాకు తెలియకుండా ఎవరూ దరఖాస్తులు చేయకూడదని బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఒకవేళ అప్పటికే దరఖాస్తు చేసి ఉంటే లాటరీకి హాజరు కావద్దంటూ అల్టిమేటం జారీ చేస్తున్నారు. దరఖాస్తుకు నువ్వు కట్టిన రూ.2 లక్షల విషయం మాట్లాడుదామంటూ హెచ్చరిక జారీ చేస్తున్నారు. తమ ఆజ్ఞలను ధిక్కరించి ఎవరైనా దరఖాస్తు చేసి షాపు దక్కించుకున్నా మమ్మల్ని కాదని వ్యాపారం ఎలా చేస్తారని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

- రాజమండ్రి సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల ప్రధాన అనుచరులు రంగంలోకి దిగారు. ఎక్సైజ్ అధికారుల నుంచి దరఖాస్తు చేసుకున్న వారి జాబితా తీసుకుని లాటరీకి రావద్దంటూ బెదిరించినట్లు తెలిసింది. కాదూకూడదని వస్తే వ్యాపారం ఎలా చేస్తావో చూస్తామంటూ హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ రెండు నియోజకవర్గాల్లో అత్యధిక షాపులు ఉండటంతో ఈ అంశం హాట్ టాపిక్ మారింది. టీడీపీ అనుబంధ విద్యార్థి సంఘం నేతలు సైతం ఇదే ధోరణి అవలంబిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.
- నిడదవోలు నియోజకవర్గంలో గతంలో సిండికేట్ నడిపిన టీడీపీ నాయకులే మళ్లీ షాపులు దక్కించుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఒక వ్యక్తయితే ఏకంటా రూ.2 కోట్ల వరకు దరఖాస్తు దారులకు రూ.2 లక్షలు చొప్పున డీడీలు కట్టినట్లు ఆరోపణలున్నాయి.
- కొవ్వూరులో సైతం టీడీపీ నేతలే ప్రధానంగా సిండికేట్ అవతారం ఎత్తారు. గతంలో మాదిరి ప్రస్తుతం కూడా షాపులు దక్కించుకునేందుకు సిద్ధమవుతున్నారు. తమకు అడ్డం వచ్చిన వారిని ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు తెలిసింది.



ఎక్సైజ్ శాఖలో లీకు వీరులు

టీడీపీ నేతలకు కొందరు ఎక్సైజ్ అధికారులు సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఏ గ్రామంలో దుకాణాలకు ఎంత మంది దరఖాస్తు చేశారు, వారి సమాచారం టీడీపీ నేతలకు ఇస్తున్నారు. ఏ షాపునకు తక్కువ దరఖాస్తులు వచ్చాయో కూడా చెబుతున్నారు. దీంతో సదరు టీడీపీ నేతలకు వారిపై ఒత్తిడి పెంచుతున్నారు. దరఖాస్తు చేసుకున్నా, లాటరీకి హాజరు కావద్దంటూ బెదిరిస్తున్నారు.

ఫీజు వాపసు ఇవ్వరు

మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ గడువు బుధవారంతో ముగియనుంది. ఈ నెల ఒకటిన ఈ ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ నెల 10న దరఖాస్తుల పరిశీలన, 11వ తేదీన దుకాణాల కేటాయింపునకు లాటరీ తీస్తారు. దుకాణం పొందిన వారు 12వ తేదీ నుంచి వ్యాపారం ప్రారంభించుకునేలా ప్రభుత్వం షెడ్యూల్ రూపొందించింది. అర్బన్ ప్రాంతాలు, వాటికి సమీప మండలాల్లో ఏడాదికి రూ.65 లక్షలు, ఇతర మండలాల్లో రూ.55 లక్షలు లైసెన్సు ఫీజుగా ప్రభుత్వం ప్రకటించింది. అయితే దరఖాస్తు చేసే ప్రతి ఒక్కరూ ఒక్కో దుకాణానికి రూ.2 లక్షలు ఫీజు చెల్లించాలి. ఎవరు ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ ఫీజు మాత్రం వాపసు ఇవ్వరు.

14 నుంచి పల్లె పండుగ వారోత్సవాలు



మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ఈ నెల 14 నుంచి 20 వరకూ పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆయన మంగళవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ జిల్లాలోని 300 పంచాయతీల పరిధిలో గ్రామ సభలు నిర్వహించి గుర్తించిన పనులను పల్లె పండుగ వారోత్సవాల్లో ప్రారంభిస్తామన్నారు. షెడ్యూల్ వారీగా ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, జిల్లా రెవిన్యూ అధికారి జి.నరసింహులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) మంగళవారం ప్రశాంతంగా జరిగిందని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. పేపర్ మిల్లు సమీపంలోని రాజీవ్ గాంధీ విద్యాసంస్థలోని ఇయాన్ డిజిటల్ జోన్‌లో ఈ పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఉదయం జరిగిన పరీక్షకు 240 మందికి 223, అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 240 మందికి 199 మంది హాజరయ్యారు. డిపార్ట్‌మెంటల్ అధికారులుగా అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, ప్రధానోపాధ్యాయులు కోలా సత్యనారాయణ, గణపతి వ్యవహరిస్తున్నారు.

న్యూస్‌రీల్

నర్సరీ సందర్శన



స్పెషల్ కలెక్టర్ సరళావందనానికి స్వాగతం పలుకుతున్న నర్సరీ రైతు పెద సత్యనారాయణ

కడియం: కడియపులంకలోని పుల్లా చంటియ్యకు చెందిన శ్రీసత్యదేవ నర్సరీని పోలవరం స్పెషల్ కలెక్టర్ ఎస్.సరళావందనం మంగళవారం సందర్శించారు. కడియం ప్రాంత నర్సరీ రైతులు నైపుణ్యంతో అభివృద్ధి చేస్తున్న వివిధ రకాల మొక్కలను గురించి స్వయంగా తెలుసుకునేందుకు నర్సరీకి విచ్చేసినట్టు ఆమె తెలిపారు. ముందుగా స్పెషల్ కలెక్టర్‌కు నర్సరీ రైతు పుల్లా పెదసత్యనారాయణ స్వాగతం పలికారు. కడియం తహసీల్దార్ కె.పోసిబాబు, డిప్యూటీ తహసీల్దార్ మహాలక్ష్మి తదితరులు ఆమె వెంట ఉన్నారు.

'పీఎం సూర్యఘర్'ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పీఎం సూర్యఘర్.. ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఈ పథకానికి సంబంధించి తొలి జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ఏకో ఫ్రెండ్లీ ఎనర్జీ ఉత్పాదన ప్రోత్సాహం అందించే ప్రయత్నంలో భాగంగా సౌర విద్యుత్ యూనిట్ల స్థాపనకు విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలన్నారు. రాయితీతో కూడిన సోలార్ రూఫ్‌టాప్‌ను ఇంటిపై ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లు చార్జీలను తగ్గించుకునే అవకాశం ఉందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వెబ్‌సైట్‌లో ఈ పథకానికి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. బ్యాంకర్లు ఎటువంటి ష్యూరిటీ లేకుండా రూ.రెండు లక్షల వరకూ పీఎం సూర్య ఘర్ సోలార్ యూనిట్ల ఏర్పాటుకు రుణాలను అందిస్తున్నాయన్నారు. ఏపీఈపీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.తిలక్ కుమార్ మాట్లాడుతూ యూనిట్ల ఏర్పాటు, ఫిర్యాదులను స్వీకరించేందుకు 1912 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉందన్నారు.

దసరాకు ప్రత్యేక రైళ్లు

రాజమహేంద్రవరం సిటీ: దసరా నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ - శ్రీకాకుళం, శ్రీకాకుళం - విజయవాడకు 16 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే సీపీఆర్ఓ ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. విజయవాడ నుంచి శ్రీకాకుళానికి ఈ నెల 9, 10, 11, 12, 14, 15, 16, 17 తేదీలలో ప్రత్యేక రైలు (07215 నంబర్) నడుస్తుందన్నారు. అలాగే శ్రీకాకుళం నుంచి విజయవాడకు ఈ నెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీలో స్పెషల్ ట్రైన్ (07216) తిరుగుతుందన్నారు. జిల్లాలోని నిడదవోలు, రాజమహేంద్రవరం, ద్వారపూడి, అనపర్తి స్టేషన్లలో ఈ ట్రైన్లు ఆగుతాయని తెలిపారు.

10న ఆధార్ శిబిరాలు

కొవ్వూరు: పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా గురువారం డివిజన్ పరిధిలో ఆధార్ నమోదు, నవీకరణకు నాలుగు శిబిరాలను నిర్వహించనున్నట్లు తాడేపల్లిగూడెం డివిజన్ పోస్టల్ సూపరిండెంటెండ్ ఆఫ్ పోస్టాఫీసెస్ కె.కృష్ణ తెలిపారు. యరమళ్ల, పశివేదల, వేగేశ్వరపురం, దొండపూడి సబ్ పోస్టాఫీసుల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. వీటిని ప్రజలందరూ తప్పని సరిగా వినియోగించుకోవాలన్నారు.

కళావిహీనంగా రాజమహేంద్రవరం



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ భరత్‌రామ్

- అధ్వానంగా పారిశుధ్యం
- ఎక్కడి పనులు అక్కడే
- మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భరత్‌రామ్ ధ్వజం

సాక్షి, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరంలో ఒకప్పుడు కనిపించే పండగ వాతావరణం ఇప్పుడు లేదని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంబాలచెరువును తాము అభివృద్ధి చేశామని, అయితే ప్రస్తుతం నిర్వహణ సరిగ్గా లేదన్నారు. తమ హయాంలో రూ.50 టిక్కెట్ పెడితే తీసేస్తామని చెప్పిన ఈవీఎం ఎమ్మెల్యే.. ఇప్పుడు ఎందుకు తీయలేదని ప్రశ్నించారు. ఒకప్పుడు ఈట్ స్ట్రీట్, హ్యాపీ స్ట్రీట్‌ల దగ్గర జనం సందడిగా ఉండేవారని, ఇప్పుడు వెలవెలబోతున్నాయన్నారు. దానవాయిపేట పార్కును ఇప్పటికీ పూర్తి చేయలేదని దుయ్యబట్టారు. మోరంపూడి ఫ్లై ఓవర్‌ను హడావుడిగా ప్రారంభించారే తప్ప లైటింగ్ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. తక్షణం విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పారిశుధ్యం అధ్వానంగా మారిందని, రెండు మూడు రోజులకు కూడా చెత్త తీసుకెళ్లే వాహనం రావడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం ప్రారంభించిన రహదారులను సైతం ఇప్పటికీ పూర్తిచేయలేదన్నారు. డివైడర్ల వద్ద ఉన్న మొక్కలకు కనీసం నీరు కూడా పోయడం లేదన్నారు. గీత కార్మికులకు పది శాతం షాపులు ఇస్తామని చెప్పారని, ఆ అంశాన్ని పాలసీలో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. సమావేశంలో ఎన్వీ శ్రీనివాస్, వాసంశెట్టి గంగాధరరావు, మార్తి లక్ష్మి, దాసి వెంకట్రావు, మార్తి నాగేశ్వరరావు, సావిత్రి, బిల్డర్ చిన్న, గణేష్ పాల్గొన్నారు.

కూరగాయల ధరల నియంత్రణకు చర్యలు



సమావేశంలో పాల్గొన్న జేసీ చిన్నరాముడు తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలు అధికంగా ఉన్నాయని, వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ఆదేశించారు. తన చాంబర్‌లో మంగళశారం జిల్లా ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతు బజార్లలో సబ్సిడీపై టమాటా, ఉల్లిపాయలను అందుబాటులో ఉంచామన్నారు. ఇతర కూరగాయలు, ఆకుకూరల ధరలను కూడా అందుబాటులో తెచ్చేందుకు ధరల నియంత్రణ కమిటీ సభ్యులు చర్యలు చేపట్టాలన్నారు. రైతు బజార్లలో కూరగాయలను కొనుగోలు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డిమాండ్‌ను అనుసరించి దిగుబడి ఉన్న ప్రాంతాల నుంచి కూరగాయలను సేకరించి, వాటిని రైతు బజార్లలో ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. పండగ సందర్భంగా ధరలను నియంత్రించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. రేషన్ సరకులు పంపిణీ చేసే వాహనాలు, చెత్త సేకరించే వాహనాల ద్వారా టమాటా, ఉల్లిపాయలను ధరల వివరాలను ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.సునీల్ వినయ్, జిల్లా పౌర సరఫరాల అధికారి జేబీఎస్ఎన్ ప్రసాదరావు, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి శామ్యూల్ రాజ్, రైతు బజార్ ఎస్టేట్ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ ఢీకొని ఉద్యోగి మృతి



రోడ్డు పైన రాంబాబు మృతదేహం



రాంబాబు (ఫైల్)

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ సిటీనగర్ వద్ద యూనియన్ బ్యాంకు ఎదురుగా మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో శెట్టి రాంబాబు అనే దివీస్ ఉద్యోగి దుర్మరణం చెందాడు. నైట్ డ్యూటీకి వెళ్లిన రాంబాబు విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా, ముందున్న ట్రాక్టర్‌ను దాటి వెళ్లే ప్రయత్నం చేశాడు. ఇంతలో ఎదురుగా లారీ వస్తుండటంతో వెనక్కు తగ్గే క్రమంలో ట్రాక్టర్ వెనుక భాగం బలంగా తగిలి రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్ర రక్తస్రావం కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన మృతుడు ఏడేళ్ల క్రితం దివీస్‌లో చేరాడు. ప్రస్తుతం జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బాలాజీనగర్‌లో నివసిస్తున్నాడు. అతనికి భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. భీమిలి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తరలించారు. అతని మృతితో తోటి ఉద్యోగులు దుఃఖంలో మునిగిపోయారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రావులపాలెం: జాతీయ రహదారిపై లారీ ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెనుమత్స శివరామరాజు (60) స్థానికంగా ఒక దాబాలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం టీ తాగడానికి రావులపాలెం సెంటర్‌కు వచ్చాడు. తిరిగి వెళుతుండగా తణుకు వైపు నుంచి రావులపాలెం వైపు వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి మేనల్లుడు మూలగపాటి అయ్యప్పరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంటి తెలిపారు.

ముగ్గురు సస్పెన్షన్

సీతానగరం: వెదుళ్లపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో నగదు గల్లంతులో సంఘ సీఈవో సురేంద్ర, గుమస్తా పోశియ్య, ఎరువుల సేల్స్‌మన్ భారతిపై ఏఆర్, అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కృష్ణమోహన్ మంగళవారం సస్పెన్షన్ వేటు పడింది. రైతుల రుణాలకు చెల్లించిన నగదు, అలాగే షేర్ క్యాపిటల్ నుంచి రూ.64 లక్షలు గల్లంతైన విషయం విదితమే. మంగళవారం కృష్ణమోహన్, ఏఆర్ శివకుమార్, రఘుదేవపురం డీసీసీబీ బ్రాంచి మేనేజర్ క్రాంతి కృష్ణ వెదుళ్లపల్లి పీఏసీఎస్‌లో రికార్డులను పరిశీలించారు. నగదు పూర్తిగా జమ చేయకపోవడంతో ముగ్గురిని సస్పెండ్ చేశారు. అనంతరం కృష్ణమోహన్ మాట్లాడుతూ, రూ 25 లక్షలు చెల్లించని కారణంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ నెల 15న డీఆర్ కార్యాలయంలో ముగ్గురిపై సర్‌చార్జి ఎంక్వైరీ ఉంటుందని, తదుపరి క్రిమినల్ కేసులు పెట్టి, లీగల్ చర్యలు తీసుకుంటామని వివరించారు.

కోనీటి కష్టం

శరన్నవరాత్ర ఉత్సవాల వేళ భక్తుల మనోభావాలకు మంగళం పాడారు పాదగయ క్షేత్ర అధికారులు. వారి అనాలోచిత చర్యల కారణంగా భక్తులకు పుణ్య స్నానాలు చేయడానికే నీరు కొరవడింది. ఎంతో ప్రాధాన్యం ఉన్న పుష్కరిణిలో పర్వదినాల్లో పుణ్యస్నానం ఆచరించాలన్న కోరిక నెరవేరేలా కనిపించడం లేదు.

- పాదగయ పుష్కరిణిలో నీటి తొలగింపు
- పుణ్య స్నానాలకు నీరు లేక దసరాకు వచ్చిన భక్తుల ఇక్కట్లు
- ఆలయ అధికారుల తీరుపై భక్తుల మండిపాటు

పిఠాపురం: శరన్నవరాత్రి ఉత్సవాలకు ముందు రోజు మహాలయ అమావాస్య సందర్భంగా ప్రముఖ క్షేత్రమైన పిఠాపురం పాదగయలో భారీగా పిండ ప్రదానాలు చేయడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పూజల అనంతరం పిండాలు పాదగయ పుష్కరిణిలో కలిపారు. దీంతో పాదగయ పుష్కరిణి పూర్తిగా కలుషితమై, దుర్వాసన వెదజల్లింది. దీనిపై 'సాక్షి'లో మంగళవారం పుష్కరిణి పిండ పంకిలం అనే శీర్షికన వార్త వెలువడడంతో హడావిడిగా ఆలయ అధికారులు పాదగయ పుష్కరిణిలో నీటిని తొలగించేశారు. హడావిడిగా మరమ్మతు పనులు చేపట్టారు.

పుణ్య స్నానాలకు మంగళం

అతి పవిత్రంగా భావించే అమ్మవారి ఆలయాల్లో ఒకటైన అష్టాదశ శక్తి పీఠాల్లో పదో శక్తి పీఠం పిఠాపురం పాదగయ క్షేత్రంలో వెలసిన పురుహూతికా అమ్మవారు. దేశవిదేశాల నుంచి అమ్మవారి దర్శనానికి వేలాదిగా భక్తులు తరలి వస్తుంటారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైతే ప్రతి రోజూ అమ్మవారి ఆలయం కిటకిటలాడుతుంది. వేలాది మంది భవానీ భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరిస్తుంటారు. అంతటి ప్రాముఖ్యం కలిగిన పాదగయ పుష్కరిణిలో ఈ ఏడాది ఉత్సవాల వేళ నీరు లేకుండా చేశారు అధికారులు. ప్రస్తుతం పుష్కరిణిలో నీటిని తొలగించి చెత్తను తీసే పనులు జరుగుతుండగా, పుణ్య స్నానాలకు నీరు లేక భక్తులు మండిపడుతున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని తెలిసి కూడా ముందస్తు చర్యలు తీసుకోపోవడం పట్ల ఆలయ అధికారుల తీరుపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తెప్పోత్సవం జరిగేనా..!

ప్రస్తుతం పుష్కరిణిలో కుళ్లను తీసే పనులు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరో మూడు రోజులు పట్టే అవకాశం కనిపిస్తోంది. దశమి చూస్తే నాలుగు రోజులు మాత్రమే ఉంది. పుష్కరిణిలో కుళ్ల తొలగించే పనులు రెండు లేక మూడు రోజుల్లో పూర్తయినా, పుష్కరిణి నిండా నీరు పెట్టడానికి కనీసం మూడు రోజులు పడుతుంది. అంటే ఈ ఏడాది శరణ్నవరాత్రి ఉత్సవాలకు పుణ్య స్నానాలకు మంగళం పాడేశారు ఆలయ అధికారులు. దీంతో పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో తప్పనిసరిగా నిర్వహించే అమ్మవారి తెప్పోత్సవం సైతం జరిగే అవకాశాలు కనిపించడం లేదంటున్నారు భక్తులు. ఉత్సవాలు ప్రారంభం నాటికి కంపు కొట్టే నీరు ఉండగా ఇప్పుడు ఎండగట్టిన పుష్కరిణి దర్శనమిస్తుండడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ అధికారులు భక్తుల పుణ్య స్నానాలకు కుళాయిలు ఏర్పాటు చేశామని చెబుతుండగా, కుళాయిల్లో నీటితో చేసే స్నానాన్ని పుణ్య స్నానం అంటే.. ఇక ఆలయానికి రావడం దేనికని భక్తులు ప్రశ్నిస్తున్నారు.



నీరు లేని పాదగయ పుష్కరిణి



పాదగయ పుష్కరిణిలో కుళ్లు తొలగిస్తున్న సిబ్బంది

జాతీయ అథ్లెటిక్స్‌కు నవర విద్యార్థిని



చాందినీ ఆహ్లాదితను సత్కరిస్తున్న హెచ్‌ఎం, గ్రామ పెద్దలు

సామర్లకోట: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం నవర జిల్లా పరిషత్తు హైస్కూల్‌కు చెందిన ఎస్ చాందినీ ఆహ్లాదిత జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ సత్యవతి మంగళవారం విలేకర్లకు వివరాలు తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న చాందినీ ఆహ్లాదిత జావెలిన్ త్రోలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం, షాట్ పుట్‌లో తృతీయ స్థానం సాధించింది. ఆమె పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ నెల 17 నుంచి గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో చాందినీ ఆహ్లాదిత పాల్గొంటుంది.

ప్రోగ్రాం డైరెక్టర్లకు పొగ

- జేఎన్‌టీయూకేలో అనుబంధ కోర్సుల డైరెక్టర్ల తొలగింపు
- కూటమి ప్రభుత్వ తీరుపై రిటైర్డ్ ప్రొఫెసర్ల మండిపాటు



బాలాజీచెరువు(కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ ఏర్పాటు నాటి నుంచి పనిచేస్తున్న ప్రోగ్రాం డైరెక్టర్లను కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అర్ధాంతరంగా తొలగించింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఏర్పడిన జేఎన్‌టీయూకే వర్సిటీలో రెగ్యులర్ ఇంజినీరింగ్, మరో 9 కోర్సులు ఏర్పాటు చేసి, రిటైర్డ్ ప్రొఫెసర్లతో పాటు, అనుభవజ్ఞులైన అధ్యాపకులను ప్రోగ్రాం డైరెక్టర్లుగా నియమించారు. తొలుత వీరిని నెలకు రూ.30 వేల నుంచి రూ.40 వేల గౌరవ వేతనంలో నియమించగా, దాదాపు 12 ఏళ్ల తర్వాత గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రోగ్రాం డైరెక్టర్ల హోదాను అడ్వయిజర్లుగా మార్చి, వారి గౌరవ వేతనాన్ని రూ.50 వేలు చేసింది. ఫార్మసీ, నానో టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఏవానాయిక్స్, ఎస్‌ఎంఈ, హెల్త్ సేఫ్టీ వంటి తొమ్మిది విభాగాలకు వీరిని నియమించారు. సాధారణంగా వర్సిటీలో ప్రోగ్రాం డైరెక్టర్లుగా ఉండాలంటే ప్రభుత్వ కళాశాలలో ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేసి ఉండాలన్న అప్పటి ఆదేశాల మేరకు వీరిని తీసుకున్నారు. వీరందరూ పలు సబ్జెక్టుల్లో విషయ పరిజ్ఞానం ఉండటంతో పాటు, టీచింగ్‌లో అనుభవం ఉండటంతో వర్సిటీ నిర్వహించే కోర్సుల్లో వీరి పాత్ర ప్రముఖంగానే ఉండేది. ఇపుడు వీరి స్థానంలో రెగ్యులర్ అధ్యాపకులను ఇన్‌చార్జి ప్రోగ్రాం డైరెక్టర్లుగా నియమించడంతో, అటు రెగ్యులర్ విధులతో పాటు, వీటికి సమయం కేటాయించలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ తొమ్మిది విభాగాలు నేరుగా రిజిస్ట్రార్ కంట్రోల్‌లో ఉండేలా ఏర్పాటు చేశారు. ఇన్నాళ్ల పాటు అందించిన సేవలు వృథా చేసి, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అర్ధాంతరంగా తొలగించిందని అడ్వయిజర్లు వాపోతున్నారు. ప్రైవేట్ కళాశాలలో తమ సేవలు అందిస్తే ఇంతకంటే రెట్టింపు గౌరవ వేతనం దక్కేదని, ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు తమ సేవలను అందించాలనే ఉద్దేశంతో ఇన్నాళ్లు పనిచేశామని రిటైర్డ్ ప్రొఫెసర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అధ్యాపకుల కొరత వేధిస్తున్న తరుణంలో ఇటువంటి నిర్ణయం సరైనది కాదని ప్రభుత్వ నిర్ణయంపై మండిపడుతున్నారు.

వేట్లపాలెంలో రుబెల్లా వైరస్ కేసులు!



జాగ్రత్తలను వివరిస్తున్న సర్వేలెన్స్ అధికారి జాన్



వేట్లపాలెంలో వివరాలు సేకరిస్తున్న వైద్య బృందం

సామర్లకోట: మండలంలోని వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు రుబెల్లా వైరస్ కేసులను గుర్తించినట్టు తెలిసింది. వికారాబాద్‌కు చెందిన ఓ యువకుడు చెల్లా శివప్రకాంత్‌కుమార్ ఇటీవల పెద్దాపురం మండలం రాజభూపాలపట్నంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి వేట్లపాలెంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లిన సమయంలో మంగళవారం తీవ్ర జ్వరం ఉంది. దీంతో అతడిని వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు వచ్చారు. అతడికి పరీక్షలు చేయడంతో పాటు, ఎంఆర్ వ్యాక్సిన్ వేసుకున్నదీ, లేనిదీ పరిశీలించారు. అదేవిధంగా హుస్సేన్ పురం గ్రామానికి చెందిన పంపన రాంబాబుకు జ్వరం రావడంతో, పరీక్షలు చేసి రుబెల్లా పాజిటివ్‌గా వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం ఇద్దరూ ఆరోగ్యంగానే ఉన్నారని డాక్టర్ శ్రీహిమవతి తెలిపారు. రిపోర్టులు అనుమానాస్పదంగా ఉండటంతో, విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో జిల్లా సర్వేలెన్సు అధికారి డాక్టర్ జాన్ ఈ రిపోర్టును పరిశీలించి, రుబెల్లా వైరస్‌గా గుర్తించినట్టు తెలిసింది. జ్వరం, ఎర్రమచ్చలు వచ్చినసమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది సూచనలిచ్చారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో స్నేహం.. ఇల్లు విడిచిన బాలికలు

మహిళా రక్షక్ టీం చొరవతో తల్లిదండ్రులకు అప్పగింత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇన్‌స్టాగ్రామ్‌లో ఏర్పడిన స్నేహంతో ఎక్కడో, ఏదో సాధిద్దామని ఇల్లు విడిచిపెట్టిన నలుగురు బాలికలను తూర్పుగోదావరి జిల్లా మహిళా రక్షక్ టీం వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చింది. రాజమహేంద్రవరంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం మంగళవారం వెల్లడించింది. జిల్లా మహిళా రక్షక్ టీం సోమవారం రాత్రి గస్తీ తిరుగుతుండగా, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు మైనర్ బాలికలను గుర్తించారు. వారిని వివరాలు అడగ్గా, పొంతన లేని సమాధానం చెప్పారు. వారిని క్షుణ్ణంగా ప్రశ్నించగా, తామంతా ఇన్‌స్టాగ్రామ్‌లో స్నేహితులమని, ఏదో సాధిద్దామని దూరంగా వెళ్లిపోయేందుకు ఇంట్లో వారికి చెప్పకుండా వచ్చామని వివరించారు. దీంతో మహిళా రక్షక్ టీం అప్రమత్తమైంది. ఆ బాలికల తల్లిదండ్రులకు సమాచారమిచ్చి రప్పించింది. బాలికలకు కౌన్సెలింగ్ ఇచ్చి, తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించినట్టు ఇన్‌స్పెక్టర్ కె.మంగాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ కిషోర్ మహిళా రక్షక్ టీం సభ్యులను అభినందించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

రూ.8 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



నిందితులు, సొత్తును చూపుతున్న సీఐ వీరయ్యగౌడ్

రాజానగరం: కొంతమూరు శివారు భవానీపురంలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన ఇద్దరు అంతర్ జిల్లా నిందితులను అరెస్టు చేశామని సీఐ ఎస్వీ వీరయ్యగౌడ్ తెలిపారు. రూ.8 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. మంగళవారం సాయంత్రం విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు శివారు భవానీపురంలో ఉంటున్న బచ్చల గంగ తన కుటుంబంతో కలిసి గత నెల 21న శంఖవరం వెళ్లారు. కాగా 24వ తేదీన ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నట్టు పొరుగు వారు ఫోన్ చేయడంతో, హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. దొంగలు ఇంట్లో ఉంచిన 22.41 గ్రాముల బంగారు నగలు, రెండు కిలోల వెండి వస్తువులతో పాటు, రూ.20 వేల నగదును అపహరించినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు రాజమహేంద్రవరం రూరల్ మండలం వెంకటనగరం ఎస్సీ పేటకు చెందిన బండి ధర్మరాజు, భవానీపురానికి చెందిన వానపల్లి గౌరీశంకర్ అనే గౌరీష్ అనే పూలోడును అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, వారు నేరాన్ని అంగీకరించారు. దురలవాట్లకు బానిసలైన వీరు రాజానగరం, బొమ్మూరు, కోరుకొండ, గోకవరం ప్రాంతాల్లో కూడా చోరీలకు పాల్పడ్డారు. వారిచ్చిన సమాచారంతో చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

ఇతర ప్రాంతాల్లో..

నిందితులు కొంతమూరులోనే మరో ఇంట్లో కారును, ఎల్‌ఈడీ టీవీని, 367 గ్రాముల వెండి వస్తువులను దొంగిలించారు. బొమ్మూరు పోలీసు స్టేషను పరిధిలో 490 గ్రాముల బంగారు నగలు, 78 గ్రాముల వెండి వస్తువులు, కోరుకొండ పరిధిలో ఒక బైకు, గోకవరం పరిధిలో బైకును అపహరించారు. ఇంతవరకు ఉమ్మడి జిల్లాలో ధర్మరాజుపై 8 కేసులు, గౌరీశంకర్‌పై 6 కేసులు ఉన్నాయి. సమావేశంలో ఎస్సై మనోహర్, క్రైమ్ పోలీసులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నలుగురికి జైలు, ఏడుగురికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మంగళవారం నిందితులను కోర్టులో హాజరుపర్చగా, ఒకరికి నాలుగు రోజుల జైలు, ముగ్గురికి రెండు రోజుల వంతున జైలు, ఏడుగురికి రూ.10 వేల వంతున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

జాతీయ టీటీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జాతీయ స్థాయి పోటీల్లో విజేతలైన క్రీడాకారులు

పెద్దాపురం: హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో శ్రీప్రకాష్ సినర్జీలోని టెన్నిస్ అకాడమి క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ మంగళవారం ఇక్కడ వివరాలు తెలిపారు. పాఠశాలలో 11వ తరగతి విద్యార్థిని చిట్టూరి సాయిశ్రుతి జాతీయ స్థాయి టీటీ పోటీల్లో అండర్-17 మిక్స్‌డ్ విభాగంలో బ్రాంజ్ మెడల్ గెలుచుకుంది. అదేవిధంగా అండర్-17 బాలికల విభాగంలో సాయిశ్రుతి, పదో తరగతి విద్యార్థిని ఎం.శాంతిజ్యోతి, తొమ్మిదో తరగతి విద్యార్థిని ముపర్ణదాస్ బ్రాంజ్ మెడల్ సాధించారు.

గ్యాస్ పైపులైన్‌కు వ్యతిరేకంగా ధర్నా

- సుంకటరేవులో పనులను అడ్డుకున్న గ్రామస్తులు
- స్పందించకపోతే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరిక



సుంకటరేవు వద్ద నిర్మిస్తున్న గ్యాస్ ట్యాపింగ్ యూనిట్ వద్ద ధర్నా చేస్తున్న స్థానికులు

తాళ్లరేవు: పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవు గ్రామంలో జాతీయ రహదారి 216ని ఆనుకుని నిర్మిస్తున్న గ్యాస్ ట్యాపింగ్ యూనిట్ పనులను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. రిలయన్స్ గ్యాస్‌ను కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో ఇంటింటికీ పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేసేందుకు పైపులైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (పీఐఎల్) ఈ ట్యాపింగ్ యూనిట్‌ను నిర్మిస్తోంది. జనావాసాల మధ్య నిర్మిస్తున్న ఈ గ్యాస్ పైపులైన్, ట్యాపింగ్ యూనిట్ల కారణంగా ఏదైనా ముప్పు సంభవిస్తే భారీ ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తుందని గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని, గ్యాస్ పైపులైన్ పనులను అడ్డుకున్నారు. వీటిని తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులు, పీఐఎల్ ప్రతినిధులతో చర్చించారు. దీంతో పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించిన తరువాతే పనులు ప్రారంభిస్తామని పీఐఎల్ ప్రతినిధులు తెలిపారు. ఈ ధర్నానుద్దేశించి పోలేకుర్రు గ్రామ సర్పంచ్ వెంటపల్లి నూకరాజు మాట్లాడుతూ, గ్యాస్ పైపులైన్ వల్ల గ్రామానికి అనేక నష్టాలు జరుగుతాయన్నారు. గాడిమొగలో ఉన్న రిలయన్స్ సంస్థ, పి.మల్లవరంలో ఉన్న ఓఎన్‌జీసీ సంస్థలు ఆయా పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తున్నాయని, అయితే ఆ రెండు కంపెనీల పైపులైన్లు పోలేకుర్రు పంచాయతీ పరిధిలో వెళుతున్నప్పటికీ, ఎటువంటి అభివృద్ధి చేయడం లేదన్నారు. స్థానిక నాయకుడు జక్కల ప్రసాద్ మాట్లాడుతూ, పంచాయతీలో ఎస్సీ, బీసీ గ్రామాలున్నాయని, గ్యాస్ పైపులైన్ వల్ల ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. తమ పంచాయతీ అభివృద్ధికి ఏం చేస్తారో 24 గంటల్లోగా యాజమాన్యం ప్రకటించాలని, లేకుంటే తీవ్ర స్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

నేటితో ముగియనున్న హ్యాండ్ బాల్ టోర్నీ



టోర్నమెంట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

రాజానగరం: ఏపీ పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యా నికేతన్‌లో రెండు రోజులుగా జరుగుతున్న 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్స్ బుధవారంతో ముగియనున్నాయి. బాలుర అండర్ 17 కేటగిరీలో మంగళవారం హోరాహోరీగా జరిగాయి. లీగ్ మ్యాచ్‌లో 13 టీమ్‌లు, నాకవుట్‌లో 4 టీమ్‌లు నిలిచాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కే స్వామి తెలిపారు. చివరి రోజున క్వార్టర్, సెమీ, ఫైనల్స్ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తారు. డీఈఓ వాసుదేవరావు, డీవైఈఓ నారాయణ ఈ పోటీలను పర్యవేక్షించారు.

హత్య కేసులో పదేళ్ల జైలు

కాకినాడ లీగల్: కుట్టు మెషీన్ దొంగతనం చేశావని అడిగిన వ్యక్తిని కర్రతో కొట్టి, హతమార్చిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి పదేళ్ల జైలు విధిస్తూ కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సకుమ జిల్లా కొర్ర గ్రామానికి చెందిన కోసా మద్వి కాకినాడ ఏడీబీ రోడ్డులో కూలీ పని చేయడానికి వచ్చాడు. అతను కొత్తూరు గ్రామంలో ఓ రూమ్‌లో ఉండేవాడు. అదే ప్రాంతంలో ఉంటున్న సింహాద్రి స్వరూప ఇంట్లో కుట్టు మెషీన్ హెడ్‌ను అతడు దొంగతనం చేశాడు. దీంతో సింహాద్రి స్వరూప ఈ విషయాన్ని గుత్తుల శ్రీనుకి చెప్పింది. ఈ క్రమంలో శ్రీనుకు, మద్వికి 2003లో గొడవ జరిగింది. ఈ క్రమంలో మద్వి విచక్షణారహితంగా కర్రతో తలపై కొట్టగా.. శ్రీను అక్కడికక్కడే చనిపోయాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో హత్య చేసినందుకు నిందితుడికి పదేళ్ల జైలు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వై.ప్రశాంతికుమారి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

దుర్గమ్మకు చీర, సారె సమర్పణ



అన్నవరం దేవస్థానం ఈఓ, చైర్మన్‌లకు దుర్గమ్మ ఫొటో ప్రసాదం అందిస్తున్న విజయవాడ దుర్గమ్మ దేవస్థానం ఈఓ రామారావు

తొండంగి: దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడలో కనకదుర్గమ్మ వారికి మంగళవారం అన్నవరం దేవస్థానం తరఫున ఈఓ కె.రామచంద్రమోహన్, చైర్మన్ ఐవీ రోహిత్‌లు సతీసమేతంగా చీర, సారె సమర్పించారు. అన్నవరం కొండపై ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విజయవాడ దుర్గమ్మ సన్నిధికి చేరుకుని చీర, సారె అందించారు. ఈ సందర్భంగా విజయవాడ దుర్గమ్మ దేవస్థానం ఈఓ రామారావు అమ్మవారి ప్రసాదం, ఫొటోను అన్నవరం దేవస్థానం ఈఓ, చైర్మన్ల దంపతులకు అందజేశారు. వారి వెంట ద్వారకాతిరుమల దేవస్థానం ఈఓ సత్యనారాయణ మూర్తి, అన్నవరం దేవస్థాన ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకుడు సుధీర్ పాల్గొన్నారు.

ప్రమాదాల సముద్రం మీద 8 నెలల పాటు ప్రపంచ దేశాలు తిరిగి రావడానికి ఇద్దరు సాహస నేవీ మహిళా అధికారులు దిల్నా, రూపా అక్టోబర్ 2న గోవా నుంచి బయలుదేరారు. కేవలం వారిద్దరు మాత్రమే ఉండే ఈ సాహసభరిత యాత్రలో వారు తోడు తీసుకెళుతున్నవి ఏమిటి? వారికి తోడుండేవి ఏమిటి? ఇంత సాహసం చేసే వీరిని చూస్తే ప్రతి అమ్మాయిలోనూ కలగదా సముద్రమంత సాహస భావన!


రూప
దిల్నా

● శక్తి

ఆటుపోట్లకు వెరవని 'షి'జర్నీ

'గమ్యం ఎలాగూ ముఖ్యమే. కాని ప్రయాణం కూడా ముఖ్యం. ఈ యాత్రలోని ప్రతి క్షణాన్నీ ఆస్వాదించండి' అని అక్టోబర్ 2న గోవాలో జెండా ఊపి భవిష్యత్ చరిత్రలో చిరస్థాయిగా నిలబడనున్న 'నావికా సాగర్ పరిక్రమ–2'ను ప్రారంభించారు నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి. కేవలం ఇద్దరు మహిళా నేవీ ఆఫీసర్లు ఐఎన్ఎస్వి తారిణి పేరున్న సెయిల్ బోట్‌లో ఎనిమిది నెలల పాటు చేయనున్న ఈ సాహసయాత్ర విజయవంతం కావాలని ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ కోరుకున్నారు.

ఐదు అంచెల యాత్ర

యాభై ఆరు అడుగుల పొడవుండే సెయిల్ బోట్ తారిణిలో కమాండర్లు దిల్నా, రూప ఒకరికి ఒకరు తోడుగా నిలిచి మొత్తం 23000 నాటికల్ మైళ్లు అంటే 40000 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. అక్టోబర్ 2న గోవా నుంచి బయలుదేరిన వీరు ఈ యాత్రను ఐదు భాగాలుగా చేస్తారు.

1. గోవా నుంచి ఆస్ట్రేలియా 2.ఆస్ట్రేలియా నుంచి న్యూజిలాండ్ 3. న్యూజిల్యాండ్ నుంచి ఫాక్‌ల్యాండ్ ఐలాండ్స్ (దక్షిణ పసిఫిక్ సముద్రం) 4.ఫాక్‌ల్యాండ్ నుంచి సౌత్ ఆఫ్రికా 5. సౌత్ ఆఫ్రికా నుంచి గోవా. భారతీయ మహిళలు అత్యంత శక్తిమంతులని ప్రపంచ దేశాలకు చాటి చెప్పేందుకు సాగుతున్న ఈ యాత్ర కోసం తరిణికి సారథిగా లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా.కే వ్యవహరిస్తుండగా.. మరో లెఫ్టినెంట్ కమాండర్ రూపా సారథ్యం వహిస్తున్నారు.

మైక్రోప్లాస్టిక్స్‌పై పరిశోధన

'నావికా సాగర్ పరిక్రమ–2' మన స్త్రీ శక్తిని నిరూపించడానికే కాదు 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ'తో అనుసంధానమై సముద్ర జలాల్లోని మైక్రోప్లాస్టిక్స్‌ను అధ్యయనం చేయడానికి కూడా ఉపయోగపడనుంది. అలాగే 'వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా'తో కలిసి సముద్రాలలోని పుష్పపత్రాలు, భారీ సముద్ర జీవులపై కూడా పరిశోధనకు అవసరమైన సమాచారం కూడా సేకరిస్తారు. వీటన్నింటికి వీలుగా 'తారిణి'ని సిద్ధం చేశారు. ఈ బోట్ ముందు భాగంలో మాస్ట్‌సెయిల్స్ ఉంటాయి. వెనుక భాగంలో రెండు స్టీరింగ్ వీల్స్, ఆటో పైలట్ సిస్టమ్, నెలకు 20 జీబీ వినియోగించుకునే సౌకర్యంతో కూడిన శాటిలైట్ యాంటెన్నా ఉంటుంది. సముద్ర జలాల్ని శుద్ధి చేసి గంటకు 30 లీటర్ల మంచినీరు ఇవ్వగల ఆర్‌వో ప్లాంట్ అమర్చారు. అవసరమైన సందర్భాల్లో వినియోగించుకునేందుకు 22 తాళ్లను అందుబాటులో ఉంచారు. ల్యాప్‌టాప్‌లు, మ్యూజిక్ సిస్టం సైతం బోట్‌లో ఉన్నాయి.

బోట్ తయారీలో అధికభాగం ఫైబర్ గ్లాస్‌ను ఉపయోగించారు. వీరి యాత్రను జీపీఎస్ విధానం ద్వారా ట్రాక్ చేస్తూ ప్రయాణం ఎలా సాగుతోందో భారత నౌకాదళం నిరంతరం పర్యవేక్షిస్తుంటుంది.

సోదరి ఇచ్చిన పాండా బొమ్మతో

'ప్రయాణం చేయడానికి భయం లేదని చెప్పడం లేదు. కానీ అంతకుమించిన ఆత్మవిశ్వాసం కూడా ఉంది. ఈ ప్రయాణంలో నాకు తోడుగా ఉంటుందని నా సోదరి పాన్‌పాన్ అని పిలుచుకునే పాండా బొమ్మ ఇచ్చింది. దీంతోపాటు ఖగోళశాస్త్రవేత్త కార్ల్‌సాగన్ రచించిన పుస్తకాలు తోడు తీసుకెళ్తున్నాను' అంది లెఫ్టినెంట్ కమాండర్ రూపా ఈ సందర్భంగా.

అమ్మ చేసిన ఊరగాయలతో

'సముద్రం ఒక గొప్ప గురువు. మాకు సహనాన్ని నేర్పిస్తుంది. బోట్‌ను మనం మంచిగా చూసుకుంటే, అది మనల్ని మంచిగా చూసుకుంటుందనే సూత్రాన్నే పాటిస్తాను. తరిణిలో మేమే ఇంజినీర్లం, ఎలక్ట్రీషియన్లం, కార్పెంటర్లం. వాతావరణ నివేదికల్ని అనుసరిస్తూ ప్రయాణం సాగించాలి. ఎనిమిది నెలల పాటు తరిణిలోనే మా నివాసం కాబట్టి పుస్తకాలు తెచ్చుకున్నా. కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్ ఇచ్చిన గిఫ్ట్స్, సంగీత వాద్య పరికరాలతోపాటు అమ్మ చేసిన ఊరగాయలు, కాలికట్ చిప్స్, టాపియోకా చిప్స్ తీసుకెళ్తున్నా. ఈ ప్రయాణం మొత్తానికి సరిపడా దోశల పిండి కూడా మా వెంట తీసుకువెళుతున్నాం. డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ లేబొరేటరీ రూపొందించిన ప్రత్యేకమైన ఆహారాన్ని మాకు అందుబాటులో ఉంచారు' అని తెలిపింది లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా.

వీరి యాత్ర సఫలం కావాలని కోరుకుందాం.

– కరుకోల గోపీకిశోర్ రాజా, సాక్షి, విశాఖపట్నం

"ఇది నవరాత్రుల పవిత్ర సమయం. ప్రజలు దుర్గాదేవి పట్ల భక్తితో వివిధ మార్గాల్లో కలిసి మెలిసి పూజలు జరుపుకుంటున్నారు. ఈ సంతోషంతో ఆమె దయకు పరవశుడనై రాసిన 'ఆవతికలాయ్' అనే గర్బా గేయాన్ని ఇక్కడ ఉంచాను. ఆమె ఆశీస్సులు మనపై ఎప్పుడూ ఉండాలి" అంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గాయని పూర్వామంత్రి పాడిన ఈ గేయం గర్బా నృత్యానికి ఉన్న ప్రాధాన్యత తెలుసుకునేలా చేయడంతో పాటు ప్రతి మదిని ఆధ్యాత్మిక సౌరభమై తాకుతోంది. సోషల్ మీడియా వేదికగా వైరల్ అవుతోంది.



● భక్తి

ఆటా పాటగ మారిన స్త్రీశక్తి


గర్బా నృత్యం

గర్బా నృత్యం అనగానే సంప్రదాయదుస్తులు ధరించిన సమూహాలు, ఆనందంగా నృత్యం చేస్తున్న దృశ్యాలు మన కళ్లముందు మెదలుతాయి. ఆధ్యాత్మిక బలానికి మానసికోల్లాసాన్ని కలిపి జరుపుకునే ఈ వేడుక మొదట గుజరాతీ గ్రామాలలో పుట్టి, దేశ ఎల్లలు దాటి నేడు ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

చిల్లులు గల మట్టి కుండలో దీపం వెలిగించి, తలపైన పెట్టుకుని అమ్మవారి విగ్రహం చుట్టూ వలయాకారంగా తిరుగుతూ భక్తి పారవశ్యంలో నృత్యం చేస్తారు. మట్టికుండ తల్లి గర్భాన్ని, జ్యోతి నుండి వెలువడే కాంతి లోపల పెరుగుతున్న కొత్త జీవిని సూచిస్తుంది. భక్తుల కోసం రాక్షసుడితో పోరాడిన దేవత పట్ల తమ ప్రేమ, కృతజ్ఞతలను ఈ నృత్యం ద్వారా తెలియజేస్తారు. మనలో ఉన్న అన్ని చెడులను నాశనం చేయడానికి, లోపల ఉన్న శక్తిని మేల్కొలిపే విధానంగా కూడా గర్బా నృత్యాన్ని చెబుతారు. గర్బా నృత్య రూపం స్త్రీత్వం, సంతానోత్పత్తిని తెలియజేస్తుంది. ఇందులో భజనలు, కీర్తనలకు చోటు ఎక్కువ. ఎక్కువ భక్తి ఆకర్షణను కలిగి ఉండే గర్బాను అమ్మవారి హారతికి ముందు నిర్వహిస్తారు.

కాలచక్రం .. పునరావృతం

దేవీ ఆరాధనలో భాగంగా చెప్పుకునే ఈ నృత్యాన్ని స్త్రీ–పురుషులు ఇద్దరూ తొమ్మిది రాత్రులు చేస్తారు. చాలా మంది ఈ తొమ్మిది రోజులూ కొన్ని ప్రత్యేక ఆహార నియమాలు, ఉపవాసాలు పాటిస్తారు. కాలచక్రం ఎప్పుడూ తిరుగుతూ పునరావృతం అవుతుంది. పుట్టుక నుంచి మరణం వరకు, మరణం నుంచి పునర్జన్మ వరకు ఆత్మ తిరుగుతూ ఉంటుంది. ఈ అన్ని అంశాల్లోనూ కదలకుండా నిరంతరాయంగా ఉండేది దైవశక్తి ఒకటే. దానికి ప్రతీకగా నృత్య వలయం మధ్య దేవీ ప్రతిమ లేదా పెద్ద దీపపు సెమ్మెను పెడతారు. జీవన చక్రం దాని చుట్టూనే పరిభ్రమిస్తుంటుందని చెప్పేందుకు ఇదొక ప్రతీక.

మహిషుని అంతం చేసిన మహిళా శక్తి

ఒక్క స్త్రీ చేతిలో తప్ప మరెవరి చేతిలోనూ మరణించకుండా ఉండాలన్న వరబలంతో మహిషాసురుడు తన శక్తులను చెడు కోసం ఉపయోగించడం ప్రారంభించాడు. అతడి దాడికి దేవతలు నిస్సహాయులైపోయారు. దుర్గాదేవి వద్దకు వెళ్లి, వేడుకున్నారు. దుర్గాదేవి ఒక్క కంటిచూపుతో ఆ రాక్షసుని అంతం చేయగలదు. కానీ, అసుర సంహారానికి ముందు తొమ్మిది పగళ్లు, తొమ్మిది రాత్రుల పాటు సాగిన సర్వోన్నతమైన యుద్ధం ద్వారా మానవాళికి గొప్ప సందేశాన్ని ఇచ్చింది. అసాంఘిక, అధార్మిక శక్తులు ఎంత బలంగా కనిపించినా, యుద్ధం ఎంతకాలం సాగినా, చివరికి ధర్మమే విజయం సాధిస్తుందని ఈ కథ ద్వారా మనకు తెలుస్తుంది. ఈ కథనాన్ని గర్బా నృత్యం ద్వారా ప్రదర్శించడం అంతర్లీనంగా కనిపిస్తుంది.

బేతే గర్బా

గుజరాత్‌లోని నాగర్ కమ్యూనిటీ 'బేతే గర్బా' అంటే కూర్చున్న గర్బా అని జరుపుకుంటారు. ఇక్కడ, భక్తులు ఒకరి ఇంటి వద్ద గుమిగూడి, గర్బా పాటలు పాడతారు. హిందువులు తమ పండుగలను బహిరంగంగా జరుపుకోవడాన్ని నిజాం నిషేధించినప్పుడు, ఇస్లామిక్ పాలనలో జునాగఢ్ లో బేతే గర్బా ప్రారంభమైంది. చాలామంది కఠినమైన ఉపవాస దీక్షలో ఉన్నప్పటికీ నృత్యం, సంగీతంతో ఉల్లాసంగా మారిపోతారు. ఉత్తర భారతదేశంలో గర్బా లో భక్తులు తబలా, మంజీరను ఉపయోగిస్తారు.

సంప్రదాయ దుస్తులతో...

ఈ నృత్యంలో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, శక్తి దేవత ఆశీర్వాదాలు కోరుకుంటూ నృత్యం చేస్తారు. గర్బా, దాండియా ఒకే విధంగా కనిపించినా, ఈ రెండింటికి వ్యత్యాసం ఉంది. గర్బాలో చేతులు, కాళ్లను సమన్వయంతో కదిలిస్తూ చేస్తారు. దాండియాలో కోలాటం కర్రలను ఉపయోగిస్తారు. గర్బా పాటలు దుర్గాదేవి, ఆమె అవతారాల చుట్టూ ఉంటే, దాండియాలో పాటలు కృష్ణుడి రాసలీలలపై ఉంటాయి.

పాదరక్షలు లేకుండా..

గర్బా దైవారాధనా రీతుల్లో చెప్పులు ధరించకపోవడం సకల జీవులకు ఆలవాలమైన భూదేవి పట్ల మనం చూపే గౌరవంగా భావిస్తారు. భూమిని నిరంతరం అంటి పెట్టుకుని ఉండే ఈ పాదాల ద్వారానే శరీరంలోకి శక్తి ప్రవాహం జరుగుతుందని నమ్మకం. ఆ దేవితో మనకు నేరుగా సంబంధాన్ని కల్పించేవి పాదాలే. అందుకే చెప్పులు లేకుండా చేసే ఈ నృత్యం పవిత్రమైన దైవారాధన వంటిది.

గర్బా.. యునెస్కో

నవరాత్రి ఉత్సవాలను గుజరాత్‌తో పాటు దేశంలోని అనేక ప్రాంతాలలో నిర్వహిస్తుంటారు. మన దేశానికే ప్రత్యేకమైన ఈ ప్రముఖ నృత్యాన్ని యునెస్కో 'ఇంటాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ ఆఫ్ హ్యుమానిటీ' (ఐసీహెచ్) జాబితాలో కిందటేడాది చేర్చింది. అమ్మవారి ఎదుట భక్తిని నృత్యరూపంలో చాటే ఈ ప్రాచీన సంప్రదాయం ఇప్పటికీ ఎప్పటికీ సజీవమే అనడానికి ప్రతీకగా నిలుస్తోంది గర్బా.

లీగల్

ఆ రియల్ ఎస్టేట్ సంస్థపై కేసు పెట్టచ్చు

ప్రశ్న: మేము లోన్ ద్వారా ఒక రియల్ ఎస్టేట్ సంస్థ వద్దనుంచి నిర్మాణదశలోనే ఫ్లాట్ కొన్నాము. ఒప్పందం ప్రకారం పది నెలల లోగా ఫ్లాటు మాకు పూర్తి చేసి ఇవ్వాలి. కానీ సంవత్సరం అయినా ఇంకా పూర్తి చేయలేదు. లోను నెలవారీ వాయిదాలు కట్టడం కూడా మొదలైంది. ఈ పరిస్థితుల్లో మేము ఏం చేయాలి? పరిష్కారం చెప్పగలరు.

– టి.ఆర్. రాజేశ్వరి, హైదరాబాద్

సర్వసాధారణంగా రియల్ ఎస్టేట్ సంస్థ వారు, మీరు రాసుకునే ఒప్పంద పత్రం అంటే అగ్రిమెంట్‌లో సమయానికి ఫ్లాట్ నిర్మాణం పూర్తి చేసి, మీకు అందజేయకపోతే అందుకుగాను తాత్కాలిక పరిహారం/ఉపశమనం ఏం చేస్తారో రాసుకుంటారు. కొన్ని సందర్భాలలో ఫ్లాట్ అప్పగించేంతవరకు అద్దె ఇవ్వటం లేదా మీ తరఫున నెలవారీ లోను డబ్బులు సదరు కంపెనీ వారే కట్టేలా ఒప్పందాలు కూడా రాసుకుంటారు. మీ ఒప్పందపత్రంలో కూడా అటువంటి కండిషన్ ఏమైనా ఉందేమో చూసుకోండి. ఏది ఏమైనా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే, మీరు సదరు రియల్ ఎస్టేట్ సంస్థపై వినియోగదారుల రక్షణ చట్టం కింద కేసు వేయవచ్చు. మీకు జరిగిన ప్రతి నష్టాన్ని లెక్కగట్టి దానికి తోడు మీకు కలిగిన మానసిక క్షోభకి కూడా అదనంగా పరిహారం కోరవచ్చు, పొందవచ్చు. అదనంగా... ఒకవేళ మీరు కొన్న ఫ్లాట్ ప్రాజెక్టు రెరా (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) లో రిజిస్టర్ అయి ఉంటే అదనంగా రెరాకు కూడా ఫిర్యాదు చేయవచ్చు. మీ అగ్రిమెంటు, ఆస్తి కొనుగోలు పత్రాలు తీసుకొని దగ్గర్లోని లాయర్‌ని కలవండి.

మొదటగా ఒక నోటీసు పంపి, అప్పటికీ కూడా మీకు పరిష్కారం దొరకకపోతే, పైన తెలిపిన విధంగా దావా వేసి న్యాయం పొందవచ్చు. వినియోగదారుల చట్టం ప్రకారం మీ కేసు మీరు కూడా వాదించుకోవచ్చు లేదా మీ తరఫున మరెవరినైనా 'ఆథరైజ్డ్ పర్సన్'గా నియమించుకోవచ్చు. 50 లక్షల దావా వరకు జిల్లా వినియోగదారుల ఫోరంలో, 50 లక్షల నుంచి రెండు కోట్ల వరకు రాష్ట్ర ఫోరంలో అలాగే రెండు కోట్ల పైన విలువ గల దావాకి జాతీయ వినియోగదారుల ఫోరంలో మీ ఫిర్యాదును నమోదు చేయాల్సి ఉంటుంది.


– శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.com కు మెయిల్ చేయవచ్చు.





దేవుడు తన రెండు కాళ్లనూ బలహీనపరిచినా.. అవరోధాలనే అవకాశాలుగా మలుచుకుని తన జీవితాన్ని, తానే నిలబెట్టుకున్నారామె. ఇప్పుడు తన లాంటి దివ్యాంగుల ఉద్ధరణకు నడుం బిగించి వారికీ బతుకుబాట చూపుతున్నారు. ఆమే డీ హబ్ వ్యవస్థాపకురాలు కొప్పుల వసుంధర. ఉన్న చోటే వారు వ్యాపారం చేసుకునేలా అవగాహన కల్పిస్తూ రిజిస్ట్రేషన్, పెట్టుబడి, మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆమె ఇంటర్వ్యూని ఈ లింక్‌ను క్లిక్ చేసి సాక్షి @ నవశక్తిలో చూసేద్దాం.

https://www.youtube.com/watch?v=0c7–NycLyU

టెక్నాలజీ

స్వాగతం.. సుస్వాగతం



బెంగళూరులోని ఒక హోటల్‌లోకి అడుగు పెట్టిన అనన్య నారంగ్‌కు రిసెప్షనిస్ట్ స్వాగతం పలికింది.

అనన్యలో షాక్‌లాంటి ఆశ్చర్యం.

'ఇందులో ఆశ్చర్యపోవాల్సింది ఏముంది!' అనే కదా మీ డౌటు.

అయితే సదరు ఈ రిసెప్షనిస్ట్ సాధారణ రిసెప్షనిస్ట్ కాదు... వర్చువల్ రిసెప్షనిస్ట్!

'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా బెంగళూరులో వర్చువల్ రిసెప్షనిస్ట్' వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మన దేశంలో నవీన సాంకేతికత గురించి వివరంగా మాట్లాడుకునేలా చేస్తోంది.

'సాంకేతికత సహాయంతో తక్కువ సిబ్బందితో ఎక్కువ పనులను ఏకకాలంలో సమన్వయం చేస్తున్నారు. సిలికాన్ వ్యాలీలో తప్ప మన దేశంలో ఎక్కడా ఇలాంటి దృశ్యం కనిపించదు' అంటూ ఈ 'వర్చువల్ రిసెప్షనిస్ట్' ఫొటోని షేర్ చేసింది అనన్య.

'ఎంత సాంకేతిక ప్రగతి' అనే ప్రశంసల మాట ఎలా ఉన్నా... 'అబ్బబ్బే! ఇదేం ప్రగతి. అందమైన మానవ రిసెప్షనిస్ట్ స్వాగతం పలకడానికి, వర్చువల్ రిసెప్షనిస్ట్ స్వాగతం పలకడానికి చా...లా తేడా ఉంటుంది' అనే వాళ్లే ఎక్కువ!

● చిన్నారులపై జచింత

నెత్తుటేరుల అవార్డ్ నాకొద్దు


జసింతా కెర్కెట్టా

తన ఆదివాసీల సామాజిక, సాంస్కృతిక జీవితం గురించి లోతుగా రాయడమే కాదు పిల్లల ప్రపంచం గురించి కూడా రాస్తోంది కవయిత్రి జసింతా కెర్కెట్టా.

ఎక్కడ చూస్తే అక్కడ వార్తై – విశ్వరూపమున విహరిస్తున్న ఈ కాలంలో పిల్లల కోసం జసింత రాసిన 'జిర్హుల్' అనే పుస్తకానికి 'రూమ్ టు రీడ్ యంగ్ రైటర్–2024' అవార్డ్ ప్రకటించారు. పాలస్తీనాలో బాంబు దాడుల్లో మరణించిన, హింసకు గురవుతున్న పిల్లలను దృష్టిలో పెట్టుకొని ఈ అవార్డ్‌ను జసింత తిరస్కరించింది.

'రూమ్ టు రీడ్ ఇండియా' అనేది అక్షరాస్యత, లింగ సమానత్వం... మొదలైన వాటిపై పనిచేసే స్వచ్ఛంద సంస్థ. ఈ సంస్థకు ఏరోస్పేస్ దిగ్గజం 'బోయింగ్'తో సంబంధం ఉంది అని ఆరోపిస్తూ తనకు ప్రకటించిన అవార్డ్‌ను జసింత కెర్కెట్టా తిరస్కరించింది. 'బోయింగ్‌కు ఇజ్రాయెల్ సైన్యంతో 75 ఏళ్లుగా సంబంధం ఉంది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్)కు ఆయుధాలను సరాఫరా చేసే కీలక సంస్థ అయిన బోయింగ్ 'రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్'కు నిధులు అందజేస్తుంది' అని జసింత తన తిరస్కరణ కారణాలపై ఆ ట్రస్ట్‌కు లేఖ రాసింది.

'ఆయుధాలతో పిల్లల ప్రపంచం నాశనం అవుతున్నప్పుడు ఆయుధాల వ్యాపారం, పిల్లల సంరక్షణ ఏకకాలంలో ఎలా కొనసాగుతాయి?' అని ఆ లేఖలో ప్రశ్నించింది జసింత.

'సాహిత్యంలో వైవిధ్యమైన, పిల్లల కోసం రాస్తే పుస్తకాలు తక్కువగా వస్తున్నాయి. బాల సాహిత్యానికి సంబంధించిన జిర్హుల్ పుస్తకానికి అవార్డ్ రావడం సరియైనదే అయినా ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఈ అవార్డ్‌ను స్వీకరించలేను' అని చెప్పింది.

ఈ తిరస్కరణ మాట ఎలా ఉన్నా 'సాహిత్యానికి జసింత కెర్కెట్టా చేసిన కృషి విలువైనదిగా భావిస్తున్నాం' అని స్పందించింది 'రూమ్ టు రీడ్ ఇండియా' ట్రస్ట్. ఇప్పుడు మాత్రమే కాదు సామాజిక కారణాలతో తనకు వచ్చిన కొన్ని అవార్డ్‌లను గతంలోనూ తిరస్కరించింది జసింత.

పిల్లల్లో సామాజిక చైతన్యం

పిల్లలూ... మీరు ఎన్ని పువ్వుల గురించి విన్నారు? పూలన్నింటి గురించి తెలియనప్పుడు, కొన్ని పువ్వుల గురించి మాత్రమే తెలిసినప్పుడు... అవి మాత్రమే గొప్ప పుష్పాలూ, ప్రత్యేకమైన పుష్పాలూ ఎలా అవుతాయి? ఇవి మాత్రమే కాదు జిరాహుల్, జితంగి, సొనార్ఖి, సరాయ్, కోయినార్, సనాయ్ లాంటి ఎన్నో పూలు ఉన్నాయి' అంటూ పది పువ్వుల గురించి జసింత కవిత్వం రాసింది. ఈ పువ్వుల గురించి ఎప్పుడూ వినని, ఎప్పుడూ చూడని పిల్లలు కూడా జసింత రాసిన కవిత్వం చదివి, పక్కన ఉన్న బొమ్మలు చూస్తే ఎక్కడ ఏ పువ్వు కనిపించినా ఇట్టే గుర్తు పట్టేస్తారు.

ఈశ్వర్ ఔర్ బజార్, జసింతా కీ డైరీ, ల్యాండ్ ఆఫ్ ది రూట్స్‌తో సహా ఏడు పుస్తకాలు రాసింది.

'జిర్హుల్'లో పువ్వుల ప్రపంచం కనిపించినప్పటికీ అది అణగారిన వర్గాల కోసం ప్రతీకాత్మకంగా రాసిన పుస్తకం. ఆదివాసీ సంస్కృతి ఆధారంగా చేసుకొని పిల్లల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడమే ఈ పుస్తక లక్ష్యం. గాజాలో పదహారువేల మందికి పైగా చిన్నారులు మరణించారు. నెత్తుటేరులు పారాయి. ఈ నేపథ్యంలో 'రూమ్ టు రీడ్ యంగ్ రైటర్' అవార్డ్‌ను జసింత తిరస్కరించింది.



ఉద్యమ నేపథ్యం...

ఝార్ఖండ్‌లోని ఖుదపోష్ గ్రామంలో ఆదివాసీ కుటుంబంలో పుట్టిన జసింత మాస్ కమ్యూనికేషన్, వీడియో ప్రొడక్షన్‌లో డిగ్రీ చేసింది. రాంచీలోని ఒక ప్రముఖ దినపత్రికలో పని చేసింది. కెరీర్ పరంగా ఎంత ముందుకు వెళ్లినా తన మూలాలను మాత్రం మరవలేదు. 'ఆదివాసీ అండ్ మైనింగ్ ఇన్ ఫైవ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఝార్ఖండ్' పేరుతో అధ్యయన పత్రాన్ని వెలువరించింది.

'ఇండిజినస్ వాయిస్ ఆఫ్ ఆసియా' అనే పరిశోధన పత్రానికి ఇండిజినస్ పీపుల్స్ ఫ్యాక్ట్ అవార్డు లభించింది. జర్నలిస్ట్‌గానే కాదు కవిత్వానికి సంబంధించి సృజనాత్మక రచనలతోనూ ఎన్నో అవార్డ్‌లు అందుకుంది. తన కవిత్వం విషయానికి వస్తే అది ఆకాశపల్లకిలో ఊరేగదు. జ్ఞాపకాలను నెమరు వేసుకునేలా ఉంటుంది. గాయాలను గుర్తు తెచ్చుకునేలా ఉంటుంది. బూటకపు అభివృద్ధిని ప్రశ్నించేలా ఉంటుంది.

జసింత మనోహర్‌పూర్‌లోని మిషినరీ బోర్డింగ్ స్కూల్‌లో చదువుతున్న రోజుల్లో తల్లి పుష్ప అనిమ తండ్రి చేతిలో తరచు హింసకు గురయ్యేది. మరచిపోలేని ఆ హింసాత్మక దృశ్యాలు తన కవిత్వంలో కనిపిస్తాయి. వ్యక్తిగత చేదు అనుభవాలే కాదు అభివృద్ధి పేరుతో ఆదివాసీ గ్రామాల్లో జరుగుతున్న విధ్వంసం కూడా జసింత కవిత్వంలో కనిపిస్తుంది.

జసింత కెర్కెట్టా జర్నలిస్ట్ మాత్రమే కాదు సోషల్ యాక్టివిస్ట్ కూడా. బాలికల విద్యకు సంబంధించి ఎన్నో ఆదివాసీ గ్రామాల్లో పనిచేసింది. ఫోర్బ్స్ ఇండియా 'టాప్ 20 సెల్ఫ్‌మేడ్ ఉమెన్'లో ఒకరిగా ఎంపిక అయింది.